TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 260 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ గురువారం.16.04.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## తెలంగాణలో పెరగనున్న లోక్ సభ స్థానాలు..!



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: ఈనెల 16న మహిళ రిజర్వేషన్ బిల్లుతో పాటు పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనుంది. దేశంలోని ఆయా రాష్ట్రాల లోక్ సభ స్థానాల సంఖ్యలో పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ నేపథ్యంలో అందుకు అనుగుణంగా తెలంగాణ లోక్ సభ స్థానాల సంఖ్య పెరగనుంది. ప్రస్తుతమున్న వాటిని విభజించి కొత్తగా మరో 9 లేదా 10 లోక్‌సభ స్థానాలు ఏర్పాటు చేస్తారని అంచనా. దీంతో తెలంగాణ లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య 17 నుంచి 26 లేదా 27కు పెరగనుంది. పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. దీంతో జనాభా అధికంగా ఉన్నా ఆయా జిల్లాల్లో లోక్ సభ స్థానాలు పెరగనున్నాయి. అత్యధికంగా రంగారెడ్డి ఉమ్మడి జిల్లా 52,96,741 జనాభాతో రాష్ట్రంలో మొదటిస్థానంలో, దేశంలో 17వ ర్యాంకులో ఉంది.

అదే విధంగా పార్లమెంట్ స్థానాల్లో మహిళలకు 33శాతం కల్పించే బిల్లుకు కేంద్రం ఆమోదం తెలపనుంది. తెలంగాణ మహిళలకు కేటాయంచే స్థానాలు పెరగనున్నాయి.ప్రస్తుతం తెలంగాణ నుంచి లోక్‌సభలో ఇద్దరు మహిళా ఎంపీలు డీకే అరుణ, కడియం కావ్య మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 9 మంది మహిళలు తెలంగాణ తరఫున లోక్‌సభలో అడుగుపెట్టనున్నారు. ప్రస్తుత బిల్లు ఆమోదం పొందితే 2029 ఎన్నికల్లో కచ్చితంగా ప్రతి పార్టీ వారికి 9 టికెట్లు ఇవ్వాల్సిందే. 2024 ఎన్నికల్లో అన్ని లోక్‌సభ స్థానాలకు కలిపి 12,459 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. వారిలో 8,360 మంది చివరికి బరిలో నిలిచారు. వీరిలో మహిళలు 800(9.6%) మంది మాత్రమే ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో 33 శాతానికి వారి వాటా పెరగనుంది. దేశవ్యాప్తంగా 47.63 కోట్ల మంది మహిళా ఓటర్లున్నారు.

## డీలిమిటేషన్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: డీలిమిటేషన్ వ్యవహారంపై ప్రతిపక్షాలు పలు విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. జనాభా లెక్కలు చేపట్టకుండా పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన సరికాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఢిల్లీ మీడియా సమావేశంలో కౌంటర్ ఇచ్చారు. డీలిమిటేషన్ కమిషన్ అన్ని రాజకీయ పార్టీలను కలిసి, అభిప్రాయలను తీసుకుంటుందని, ప్రతిపక్షాలకు భయమెందుకని ప్రశ్నించారు. అప్పుడు సందేహాలను, ప్రశ్నలను సదురు కమిటీకి తెలియజేయండని సూచించారున. బెంగాల్‌ను విభజించడానికి డిలీమిటేషన్ అంటూ మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మహిళలు ఇంకెంత కాలం వేచి ఉండాలి, ఆమె మహిళలకు రిజర్వేషన్లను ఆపడానికి ప్రయత్నిస్తుందా, బెంగాల్ ప్రజల మనస్సులలో భయాన్ని కలిగిస్తోందని మండిపడ్డారు. మహిళ రిజర్వేషన్లు బిల్లుపై మమతా తన వైఖరీ ఎంటో స్పష్టంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ సీట్లను 850కి పెంచాలన్న కేంద్రం ప్రతిపాదనపై విలేఖర్లు ప్రశ్నించగా.. అదే గరిష్ఠ పరిమితి అని ఆమె స్పష్టం చేశారు.

## ప్రజలను తప్పుదోవ పట్టిచ్చే ప్రచారంపై హైడ్రా ఖండన



అమృత్ తెలంగాణ: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో కబ్జాదారులకు హైడ్రా కళ్లెం వేసిన విషయం విదితమే. దశాబ్దాలుగా న్యాయవాది ముసుగులో ఎం.ఎ.ముఖీం సాగిస్తున్న ఆక్రమణలకు హైడ్రా చెక్ పెట్టింది. దీంతో ఆ పరిసర ప్రాంతాలకు చెందిన వారు ఊపిరి పీల్చుకున్నారు. కొందరు సామాజిక మాద్యమాల్లో(సోషల్ మీడియా) ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించడాన్ని హైడ్రా ఖండించింది. ఈ విషయంపై హైడ్రా అధికారులు శనివారం వివరాలు వెల్లడించారు. ముఖీం సోదరుడు ఎంఏ అజీం దుబారులో నివాసం ఉంటున్నాడు. షోకాజ్ నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్లను పట్టించుకోకుండా అనుమతులేవీ లేకుండా ఎం.ఎ.అజీం తన అనుచరగణంతో అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ భూమిలో 6 అంతస్తుల భవన నిర్మాణం చేశారు. ప్రభుత్వ భూమిలో భవన నిర్మాణంపై స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా విచారణ చేపట్టింది. ఈ విషయం తెలుసుకున్న అజీం అపార్టుమెంట్లు కట్టి, హైడ్రా వచ్చేసరికే కొన్నింటిని విక్రయించాడు. ఈ క్రమంలోనే ఐలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ భూమిలో జరుగుతున్న నిర్మాణాలపై హైడ్రా పూర్తి వివరాలు సేకరించింది. ఇప్పటికే 4 అపార్టుమెంట్లు నిర్మించి ప్రజలకు అమ్మేయగా.. శనివారం తొలగించిన 6 అంతస్తుల భవనం నిర్మాణ దశలోనే హైడ్రా హెచ్చరించింది. ఈ భవనానికి ఎలాంటి అనుమతులూ లేవని 2025 జూన్ 25వ తేదీన హైడ్రా షోకాజ్ నోటీసు ఇచ్చింది. పంచాయతీతోపాటు మున్సిపాలిటీలోనూ ఎక్కడా ఎలాంటి అనుమతులు తీసుకున్నట్టు ఆధారాలు లేవని హైడ్రా నిర్ధారించింది. దీంతో 2025 జులై 3న స్పీకింగ్ ఆర్డర్‌ను హైడ్రా జారీ చేసింది. 15 రోజుల గడువు కూడా ఇచ్చింది.

షోకాజ్ నోటీసు, స్పీకింగ్ ఆర్డర్‌ను పట్టించుకోకుండా.. భవన నిర్మాణాన్ని ముఖీం సోదరుడు అజీం పూర్తి చేశాడు. హైడ్రా నోటీసుల దృష్ట్యా కొనడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ భవనంలోని 45 ఫ్లాట్లలో ఒక్కటి కూడా అమ్ముడు పోలేదు. దీంతో వాటిని అజీం తన అనుచరులతోపాటు, ఈ విషయాలు ఏవీ తెలియని అమాయకులతో 20 ఫ్లాట్ల వరకూ నింపాడు. అద్దెకు ఉన్న వారిని ఖాళీ చేయాలంటూ భవన యజమానికి హైడ్రా నోటీసులు ఇచ్చింది. ఈ మేరకు ఈనెల 11న రెవెన్యూ, మున్సిపల్, పోలీసు శాఖలతో కలిసి హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. అందులో ఉంటున్న వారికి హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బంది అండగా ఉంటూ, వారి సామాన్లను భద్రంగా కిందకు దించింది.

ఈలోగా ఒకటి, రెండు సామాజిక మాద్యమాల వారు.. భవనంలో ఉన్న వారి ఫొటోలు, సామాన్లను సర్దుకుంటున్న వారి ఫొటోలను, వీడియోలు తీసి ప్రసారం చేసి గందరగోళం సృష్టించాలనుకున్నారు. వాస్తవానికి ఆ భవనాన్ని కూల్చడం గంటల్లో జరిగిపోయేది. కానీ అందులో ఉన్న కొద్దిమందిని ఖాళీ చేయించడానికి, తరలించడానికి ఉదయం నుంచి సాయంత్రం వరకూ హైడ్రా సమయం ఇచ్చింది. నిర్మాణాల తొలగింపుతో ముఖీం ఆగడాలకు అడ్డుకట్ట పడిందని అక్కడ నివాసితులు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఆగడాలకు చెక్ పెట్టడంలో అందరూ పాత్రదారులు కావాలని హైడ్రా కోరుతోందని అధికారులు వివరణ ఇచ్చారు. సామాజిక మాద్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు.

## జీవన్‌రెడ్డి వెళ్లినా మేము పార్టీతోనే



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నేత జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడినా మేము పార్టీతోనే ఉంటామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జగిత్యాల నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళతామన్న తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను రెండోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు కలిసికట్టుగా పని చేస్తామని భరోసా ఇచ్చారు. ఈమేరకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జరిగిన సమావేశంలో వారు తెలిపారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ జీవన్‌రెడ్డిని తక్కువ చేసి చూడలేదని చెప్పారు. మొండి పట్టుదలతో జీవన్ రెడ్డి పార్టీని వీడారని తెలిపారు. 40 ఏండ్లు ఆయన కోసం పని చేసిన కార్యకర్తలను మోసం చేసి. .దుర్మార్గుడైన కట్టసీఆర్‌తో ఆయన జత కట్టారని విమర్శించారు. ఆయన గౌరవాన్ని తగ్గించేలా వ్యవహరించలేదని స్పష్టం చేశారు. 2023 ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం అంతా కష్టపడ్డామని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో ఆయన్ను కరీంనగర్ నుంచి పోటీ చేయాలని కోరితే, ఆయన నిజామాబాద్‌ను ఎంపిక చేసుకున్నా...పార్టీ ఆయనకు టికెట్ ఇచ్చిందని చెప్పారు. అక్కడి నుంచి ఆయన ఓడిపోయారని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కూడా జీవన్‌రెడ్డి సూచించిన వారికే టికెట్లు ఇచ్చామన్నారు. భవిష్యత్తులో ఆయనకు, ఆయన కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తుకు హామీ ఇచ్చినా వినలేదని తెలిపారు.

జీవన్‌రెడ్డి లాంటి వ్యక్తి కేసీఆర్ దగ్గర చేతులు కట్టుకుని నిలబడటం అత్యంత బాధాకరమని చెప్పారు. జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మగౌరవాన్ని జీవన్‌రెడ్డి కేసీఆర్ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని విమర్శించారు. ఆయన వయసుకు, అనుభవానికి ఇది తగదని హితవు పలికారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజరుకుమార్, జగిత్యాల డీసీసీ అధ్యక్షులు నందయ్య, ఇతర ముఖ్య నాయకులు హాజరయ్యారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని బందీ చేసిన కాంగ్రెస్



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: అంబేద్కర్ విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బందీ చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. బీఆర్ఎస్ హెచ్చరికతోనే ప్రభుత్వం కండ్లు తెరిచి అక్కడ ఏర్పాట్లు చేసిందని చెప్పారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ నుంచి భారీ కాన్వారుతో కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు హుస్సేన్ సాగర్ తీరాన ఉన్న 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లారు. బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాలలు వేసి వారు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్దదైన ఈ అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. 'బోధించు, సమీకరించు, పోరాడు'అనే అంబేద్కర్ సిద్ధాంతమే పునాదిగా తాము తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. మాటల్లోనే కాకుండా, చేతల్లో గౌరవం చూపించాలనే ఉద్దేశంతో దళితుల కోసం వెయ్యి గురుకులాలను ఏర్పాటు చేశామనీ, రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టామని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2024 నుంచి ఈ విగ్రహాన్ని బందీగా మార్చిందని అన్నారు. తాము 14 రోజుల క్రితం హెచ్చరించిన తర్వాతే ప్రభుత్వం ఇప్పుడు అధికారికంగా వేడుకలు నిర్వహిస్తోందని వివరించారు. చేవెళ్ళ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌తోపాటు బీసీ, రైతు డిక్లరేషన్లను అమలు చేసే వరకు అంబేద్కర్ స్ఫూర్తితో తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. అనంతరం కేటీఆర్, ఇతర ప్రజాప్రతినిధులు విగ్రహం కింది భాగంలో ఉన్న భవనంలోని మ్యూజియంను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన అంబేద్కర్ జీవిత విశేషాలను, చారిత్రక ఘట్టాలను వారు ఆసక్తిగా తిలకించారు.

## డిలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నాం: ఇండియా బ్లాక్

హైదరాబాద్: అమృత్ తెలంగాణ:నారీ శక్తి వందన్ అభినీయం(మహిళలకు 33శాతం రిజర్వేషన్ ) బిల్లుతో పాటు డిలిమిటేషన్ సవరణను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడాన్ని ఇండియా బ్లాక్ వ్యతిరేకిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత మల్లిఖార్జున అన్నారు. పార్లమెంట్, అసెంబ్లీల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అందుకు తామంత మద్దతు ఇస్తామన్నారు. కానీ సమగ్ర చర్చలు లేకుండా పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రవేశపెట్టడం సమంజసం కాదని, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలతో సుదీర్ఘ చర్చలు జరపాల్సిన అవసరముందని ఆయన నొక్కి చెప్పారు. ఏకాభిప్రాయంలేని నిర్ణయాలు, చర్యలు సదురు బిల్లును బలహీనతలను, లోటుపాట్లలను తెలియజేస్తోందన్నారు. డిలిమిటేషన్‌పై రాజకీయ ఎజెండాతో మోడీ సర్కార్ ముందుకు పోతుందని విమర్శించారు. డిలిమిటేషన్ విషయంలో బీజేపీ చీప్ ట్రిక్స్ ప్లే చేయాలని చూస్తోందని, ప్రతిపక్షాలన్ని పార్లమెంట్‌లో సదురు బిల్లును వ్యతిరేకిస్తాయని, అందుకు తామంతా ఏకాభిప్రాయంతో ఉన్నామని దీమా వ్యక్తం చేశారు. జనాభా లెక్కలపై కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టత లేదని, రాజ్యాంగం ప్రకారం ఎప్పుడైనా నియోజకవర్గాల పునర్విభజనను చేపట్ట వచ్చు. కానీ వారు(బీజేపీ) ఇప్పటికే అస్సాం, జమ్మూ కాశ్మీర్‌లలో జనాలను మోసం చేశారని ఆరోపించారు. ఢిల్లీలోని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో ప్రతిపక్షనేతలందురు భేటీ అయ్యారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడితో పాటు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఆర్జేడీ వర్కింగ్ ప్రెసిడెంట్ తేజస్వి యాదవ్, ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంపి సుప్రియా సూళే, శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్, రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్, ఇతర ప్రముఖ ఇండియా బ్లాక్ నాయకులు హాజరయ్యారు.

## సీబీఎస్ఈ టెన్త్ ఫలితాలు విడుదల




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాల్లో మొత్తం ఉత్తీర్ణత శాతం 93.70గా నమోదైంది. గతేడాది 93.66 శాతంతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది. ఫలితాల్లో బాలికల ఉత్తీర్ణత శాతం 94.99శాతం ఉండగా బాలురుది 92.69శాతంగా ఉంది. ప్రాంతాల వారీగా చూస్తే త్రివేంద్రం అత్యధికంగా 99.79శాతం ఉత్తీర్ణత సాధించి అగ్రస్థానంలో నిలిచింది. సంస్థల వారీగా చూస్తే కేంద్ర విద్యాలయాలు (KV) అత్యుత్తమ ఫలితాలను సాధించాయి. వీటి ఉత్తీర్ణత శాతం 99.57శాతంగా నమోదైంది. ఫలితాల తర్వాత సప్లమెంటరీ పరీక్షలు మే మధ్యలో ప్రారంభం కానున్నాయి. అలాగే లిస్ట్ ఆఫ్ కాండిడేట్స్ విండో ఏప్రిల్ 16 నుండి 20 వరకు అందుబాటులో ఉంటుంది.

# రహదారి భద్రత - అందరి బాధ్యత : మంత్రి పొన్నం ప్రభాకర్

## ఆదిలాబాద్‌లో ఘనంగా రహదారి భద్రత అవగాహన కార్యక్రమం

## విద్యార్థులతో భారీ మానవహారం.. బైక్ ర్యాలీని ప్రారంభించిన మంత్రి



బోరంచు శ్రీకాంత్ రెడ్డి కి హెల్మెట్ ధరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్




బైక్ నడుపుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ మరియు ఎమ్మెల్యే పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రహదారి నిబంధనలు పాటించడం కేవలం చట్టం కోసం కాదని, అది మన ప్రాణాలకు రక్షణ కవచమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలనా- ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహించిన అరైవ్ అలైవ్, రహదారి భద్రత అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలపై సమాజంలో అవగాహనా పెంపొందించడంలో విద్యార్థుల పాత్ర కీలకమని అన్నారు. దేశంలో సహజ మరణాల కంటే, రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారే ఎక్కువగా ఉండటం అత్యంత ఆవేదన కలిగించే అంశమని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం నాలుగు ప్రధాన అంశాలపై దృష్టి సారించిందని మంత్రి వివరించారు. ప్రజల్లో అవగాహన కల్పించడం, రహదారుల నిర్మాణం, లోపాల సవరణ, నిబంధనల కఠినంగా అమలు చేయడం, ప్రమాదం జరిగిన వెంటనే వైద్యం అందించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల వారు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్ ప్రయాణం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన హెచ్చరించారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. యువత వేగాన్ని నియంత్రించుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం ఆత్మహత్యతో సమానమని అన్నారు. ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే పోలీసు, రవాణా శాఖల కృషి ఫలిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు స్టేడియం మైదానంలో పాఠశాల విద్యార్థులతో కలిసి మంత్రి 'హెల్మెట్ – సేవ్ లైవ్స్' (Helmet - Save Lives) ఆకారంలో భారీ మానవహారాన్ని నిర్వహించారు. విద్యార్థులు రహదారి భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. అనంతరం యువతకు లెర్నింగ్ లైసెన్స్‌లను, డ్రైవర్లకు ఉచితంగా కళ్లద్దాలను మంత్రి పంపిణీ చేశారు. అనంతరం మంత్రి స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని మంత్రి ప్రారంభించడమే కాకుండా, స్వయంగా పాల్గొని ఉత్సాహపరిచారు. అనంతరం అంబెద్కర్ చౌక్ లో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని వాహనదారులకు హెల్మెట్లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ మల్లెపూల నర్సయ్య, జిల్లా ఇంచార్జి కలెక్టర్ యువరాజు మర్మాట్, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పి. రవీందర్ కుమార్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కె. హరీంద్ర కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి : మంత్రి పొన్నం ప్రభాకర్





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రహదారి నిబంధనలపై అవగాహన అనేది చిన్ననాటి నుంచే అలవడాలని, అప్పుడే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని చావర పాఠశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన 'చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్'ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించి, విద్యార్థులతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 'మొక్కై వంగనిది మానై వంగునా' అన్న సామెతను గుర్తు చేస్తూ, చిన్న వయసులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన లేకపోతే భవిష్యత్తులో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఈ పార్క్ ద్వారా విద్యార్థులు ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు గుర్తులపై ప్రత్యక్షంగా అవగాహన పెంచుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు ఇక్కడికి వచ్చి అవగాహన పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారి భద్రతలో నాలుగు అంశాలు ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్, ఎన్ఫోర్స్మెంట్, ఎమర్జెన్సీ కీలకమని మంత్రి వివరించారు. గతంలో ప్రమాదం జరిగితే సాక్ష్యంగా ఉండాల్సి వస్తుందనే భయంతో ఎవరూ ముందుకు వచ్చేవారు కాదని, కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రహవీర్' అవార్డు ద్వారా ప్రాణాలు కాపాడిన వారికి 25 వేల నగదు బహుమతితో పాటు సత్కారం అందిస్తున్నట్లు గుర్తుచేశారు. హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, రాంగ్ రూట్‌లో వెళ్లకపోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని కోరారు. భవిష్యత్తులో పాఠశాల పాఠ్యాంశాల్లో కూడా రహదారి భద్రతను ఒక అంశంగా చేర్చే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని మంత్రి వెల్లడించారు. స్థానిక శాసన సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ, రహదారి నిబంధనల పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతికతతో మనిషి దేనినైనా తిరిగి పొందగలడు కానీ, ప్రాణాన్ని మాత్రం తిరిగి తీసుకురాలేమని, కాబట్టి ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్‌ను తూచా తప్పకుండా పాటించాలని కోరారు. కేవలం పోలీసుల జరిమానాలకే భయపడకుండా, తమ ప్రాణ రక్షణ కోసం నిబంధనలు పాటించాలనే ఆలోచన ప్రజల్లో కలగాలని ఆయన ఆకాంక్షించారు. రహదారి భద్రతపై అవగాహన కేవలం పట్టణాలకే పరిమితం కాకుండా, ప్రతి గ్రామంలోని పాఠశాలలు, పంచాయతీల వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. జాతీయ రహదారులపై మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన తెలిపారు. ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, రహదారి నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించి అమూల్యమైన ప్రాణాలను రక్షించుకోవచ్చని అన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని, ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చిన్న ప్రయాణమైనా హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లల్లో ఈ అలవాటు పెంపొందించాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవడం అవసరమని తెలిపారు. ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతానికి కేంద్రంగా ఉన్నందున ఇక్కడ ఆర్‌టీఓ యూనిట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఉట్నూర్ బస్టాండ్ పరిసరాల్లో ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఉట్నూర్ నుండి ఆదిలాబాద్‌కు ఉదయం వేళల్లో ఉద్యోగాలు, విద్య కోసం వెళ్లే ప్రజల సౌకర్యార్థం కనీసం రెండు నాన్‌స్టాప్ మినీ బస్సులను ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్, అతివేగం ప్రమాదకరమని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరారు. ప్రజలు బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి ప్రమాద రహిత సమాజం నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. రవాణా శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వికాస్ రాజ్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను నివారించడం, ప్రాణనష్టాన్ని తగ్గించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 'ఎరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి పాఠశాలలో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులతో పాటు వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదానికి గురైన వారికి 1.5 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని, దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 ఆసుపత్రులను గుర్తించడం జరిగిందని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించి ప్రమాద రహిత సమాజ స్థాపనకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఆర్ టి సి ఎండి నాగిరెడ్డి మాట్లాడుతూ, గత ఏడాది జిల్లాలో 117 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందగా, ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులేనని తెలిపారు. హెల్మెట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. తెలంగాణ ఆర్టీసీ సేవలను ప్రశంసిస్తూ, డ్రైవర్లకు మెరుగైన శిక్షణ కోసం సిమ్యులేటర్లు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపే ప్రాణరక్షకు మార్గం అని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల అవగాహన అత్యంత కీలకమని తెలిపారు. విద్యార్థులకు చిన్న వయసు నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు 'ఖాకీ కిడ్స్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో గత వారం రోజుల్లో 14 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల సుమారు 400 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ గుర్తించబడినట్లు తెలిపారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కఠినతరం చేయడంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు తగ్గుముఖం పట్టినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించి బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రోడ్డు భద్రత నియమాలపై అవగాహనా కల్పించిన విద్యార్థులను మంత్రి అభినందించి, మెడల్ లను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ మల్లెపూల నర్సయ్య, జిల్లా ఇంచార్జి కలెక్టర్ యువరాజు మర్మాట్, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పి. రవీందర్ కుమార్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కె. హరీంద్ర కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వేడిగాలులపై అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ రాజర్షి షా




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సాధారణ స్థాయికి మించి 1.5°C నుండి 3.5°C వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని, జిల్లాలో వచ్చే వారం రోజుల పాటు వేడి గాలులు (హీట్‌వేవ్) ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. పట్టణాలు, గ్రామాలు, ట్రాఫిక్ కూడళ్ల వద్ద అవసరమైన ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. చలివేంద్రాల్లో ప్రజలకు తాగునీటితో పాటు ఓఆర్ఎస్ (ORS) ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రజలు తగినంత నీరు తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, అనారోగ్యంతో ఉన్న వారు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. జిల్లాలో హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్‌ను అత్యవసరంగా సిద్ధం చేసి అమలు చేయాలని, ప్రదేశాల వారీగా వాతావరణ పరిస్థితులను భారత వాతావరణ శాఖ (IMD) వెబ్‌సైట్ ద్వారా నిరంతరం పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు అప్రమత్తంగా ఉండాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, డీహైడ్రేషన్ చికిత్సకు అవసరమైన ఔషధాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ప్రజలు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# గజదొంగ టేకం తుకారం పై పిడి యాక్ట్ నమోదు

**ఇప్పటివరకు ఇతనిపై 44 కేసులు నమోదు.**

**10 సంవత్సరాలుగా దొంగతనం చేస్తున్న నిందితుడు.**

**ప్రవర్తన మార్చుకోకుండా మరల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగపై పిడి యాక్ట్ నమోదు**

**చర్లపల్లి జైలుకు తరలింపు : ఉట్నూర్ సిఐ మడవి ప్రసాద్**



అమృత్ తెలంగాణ ఉట్నూర్ న్యూస్ నిందితుడి వివరాలు టేకం తుకారం (40) s/o లేట్ ఆనంద్ రావు, దంతన్పల్లి, ఉట్నూర్.

ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల్, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న గజదొంగ టేకం తుకారం పై ఉట్నూర్ పోలీసులు పిడి యాక్ట్ (Preventive Detention Act) నమోదు చేశారు. నిందితుడు గత దాదాపు 10 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ, ఇప్పటివరకు సుమారు 44 దొంగతనం కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, టేకం తుకారం దంతనపల్లి ఉట్నూరు మండలానికి చెందిన వ్యక్తి, గత కొన్ని సంవత్సరాలుగా దొంగతనాలకు పాల్పడుతూ ఉన్నాడని తెలిపారు. గతంలో ఇతనిపై 36 కేసులు నమోదు కాగా, అందులో దాదాపు 18 కేసుల్లో కోర్టు ద్వారా నేరం నిరూపణ పొంది జైలు శిక్షను అనుభవించారు. జైలు నుండి విడుదలైన తర్వాత ఈ మధ్యలో అతనిపై ఉట్నూర్ పోలీస్ స్టేషన్లో ఏడు కేసులు, మంచిర్యాల పోలీస్ స్టేషన్లో ఒక కేసు నమోదు అయినవని తెలిపారు. మొత్తం అతనిపై 44 కేసులు ఉన్నాయని తెలిపారు. గతంలో పలుమార్లు చేసిన దొంగతనాలకు జైలు శిక్ష అనుభవించినా, జైలు నుంచి విడుదలైన తరువాత కూడా తన ప్రవర్తనలో మార్పు లేకుండా మళ్లీ దొంగతనాలకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాడు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రజల భద్రతను కాపాడడం కోసం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సిఫార్సు మేరకు జిల్లా కలెక్టర్ నిందితుడిపై మళ్లీ పిడి యాక్ట్ నమోదు చేయడం జరిగింది. పీడీ యాక్ట్ నమోదైన నిందితున్ని చర్లపల్లి జైలుకు తరలించడం జరిగింది అని తెలిపారు. నిందితుల అక్రమ కార్యకలాపాలను అరికట్టడమే పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్ మాట్లాడుతూ, పునరావృతంగా నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టం పట్ల ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. ప్రజలు కూడా అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిక

## కాంగ్రెస్‌లోకి మాజీ ఉప సర్పంచ్ , బజార్ హత్నూర్ గ్రామ మున్నూరు కాపు సంఘం సలహా సభ్యుడు మరియు ఆదివాసీ నాయకుడు తులసిరాం చేరిక

## కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఆడే గజేందర్



అమృత్ తెలంగాణ ఇచ్చోడా న్యూస్ బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్, గ్రామ మున్నూరుకాపు సంఘం సలహా సభ్యుడు చాట్ల విలాస్,బాలన్‌పూర్ గ్రామానికి చెందిన ఆదివాసీ నాయకుడు తులసీ రాం బోథ్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి ఆడే గజేందర్ మరియు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య గారి చేతుల మీదిగా కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ సందర్బంగా చేసిన వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కోట్లాది మంది ప్రజలతో కలిసి తాను కూడా నిరంతరం పోరాటం చేశానని, అయితే తాను పనిచేసిన పార్టీలో కనీస గుర్తింపు లేదా గౌరవం లభించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు చులకనగా చూసే పరిస్థితులు ఎదురవ్వడంతో, పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం అయిన కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు తనను ఆకర్షించాయని తెలిపారు అందుకే ఆ పార్టీకి మద్దతుగా చేరుతున్నట్లు వెల్లడించారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మండల కన్వీనర్ జల్కె పాండురంగ్, మాజీ నెట్ క్యాప్ డైరెక్టర్ చిలుకూరి భూమన్న, నాయకులు.. విజేందర్, అరే పాండు, రవి సందీప్,బద్దం పోతారెడ్డి, యండి సద్దాం తదితరులు ఉన్నారు

# కాలిపోయిన పంట పొలాన్ని పరిశీలించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## రైతు అజీస్ పటేల్ కి ఎమ్మెల్యే భరోసా

## ధైర్యంగా ఉండండి అండగా ఉంటామని ధైర్యం

## ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించాలని డిమాండ్



అమృత్ తెలంగాణ తలమడుగు న్యూస్ తలమడుగు మండలంలోని దేవపూర్ గ్రామానికి చెందిన అజీస్ పటేల్ జొన్న పంట కాలిపోయిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం పంట పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... దేవపూర్ గ్రామానికి చెందిన అజీస్ పటేల్ కు సంబంధించిన 6 ఎకరాల జొన్న పంట పూర్తిగా కాలిపోవడం బాధాకరమని అన్నారు. అధైర్యపడొద్దని ప్రభుత్వం తరపున అండగా ఉంటామని రైతు అజీస్ పటేల్ కు ఎమ్మెల్యే భరోసా కల్పించారు. ప్రభుత్వం కచ్చితంగా నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కేవలం వరి పంటలకే కాకుండా ఆదిలాబాద్ జిల్లాలో పండించే అన్ని పంటలకు రూ. 500 బోనస్ అందిస్తే రైతులకు ఊరట కలుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ భీమా పథకం అమలు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# దారుణం..సొంత తమ్ముడినే చంపేసిన అన్న

అమృత్ తెలంగాణ: హైదరాబాద్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అజంపురలో అన్న హాసిం హుస్సేన్ తన సొంత తమ్ముడు షాఫ్దాన్ హుస్సేన్‌ను బుధవారం తెల్లవారుజామున హత్య చేశాడు. ఇద్దరి మధ్య కొంతకాలంగా విబేధాలు ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు హాసిం పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గోధూర్ 2వ అంగన్వాడి సెంటర్ లో పోషణ పక్వాడ కార్యక్రమం





ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ: ఏప్రిల్ 15 జగిత్యాల ఇబ్రహీంపట్నం మండలం గోదూర్ గ్రామంలోని రెండవ అంగన్వాడి సెంటర్ లో పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఐసిడిఎస్ సూపర్వైజర్ శోభారాణి ఆధ్వర్యంలో వి ,హెచ్ ,ఎస్ ,యన్ డి, పిల్లల అభివృద్ధి మైలు రాళ్ళను గుర్తించడంలో తల్లిదండ్రులకి సంరక్షణకు అవగాహన, అన్న ప్రసరణ అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు , ఇట్టి కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు కాయితీ భాగ్యవతి , ఈశ్వరి , తల్లులు బాలింతలు గర్భవతులు, పాల్గొన్నారు

# ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మక్కల కొనుగోలు కేంద్రం ని సందర్శించిన జువ్వడి కృష్ణరావు





ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ: ఏప్రిల్ 15 ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి,రైతులతో మాట్లాడిన జువ్వడి కృష్ణ రావు గారు కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చెయ్యాలని, రైతులకు ఇబ్బంది కలుగకుండా ఇంక కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి, జొకిన మక్కలసంచులు త్వరగ లోడింగ్ త్వరగా పూర్తి చెయ్యాలని సంబంధిత అధికారులతో మాట్లాడడం జరిగింది . ఈ కార్యక్రమం లోకాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎలాల వెంకట్ రెడ్డి,

BC సెల్ అధ్యక్షుడు బుస రాజేష్,ఎలిసే రాజు, గుడ ఐలాపూర్ భూమారెడ్డి, గూడ రాజారెడ్డి,పిట్టల వంశీ,కళ్లెం సత్య రెడ్డి,రెబ్బటి శేఖర్, తిమ్మని రాములు,వల్గొట్ నరేష్ బజ్జి సంజీవ్, కనుక జగన్,

# చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం


## రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద





అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ ఏప్రిల్ 15, 2026: జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మందమర్రి, క్యాతనపల్లి, చెన్నూర్ మున్సిపాలిటీల కమిషనర్లు రాజలింగు, మారుతి ప్రసాద్, మురళీకృష్ణ, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ లతో కలిసి మందమర్రి మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వేసవి అయినందున ప్రజలకు అంతరాయం లేకుండా ప్రతి రోజు నీటిని సరఫరా చేసే విధంగా కార్యచరణ రూపొందించి అమలు చేయాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మందమర్రి మండల కేంద్రంలోని నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, ప్రభుత్వ ఐ.టి.ఐ. ప్రిన్సిపల్ దేవానంద్ లతో కలిసి సందర్శించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి అభివృద్ధి చెందే దిశగా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. టాంకామ్ ద్వారా విదేశాలలో ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందని, జర్మనీలో ప్రతి సంవత్సరం 5 లక్షల ఉద్యోగుల అవసరం ఉందని, ప్రతి సంవత్సరం 90 వేల వీసాలు జారీ చేసేందుకు ఆ దేశం ముందుకు వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అధునాతన సాంకేతిక కేంద్రాల (ఎ.టి.సి.)ద్వారా 25 వేల మంది యువతకు వివిధ కోర్సులలో నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 4 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుందని తెలిపారు. టామ్ కామ్ ద్వారా 4 నెలల్లో జర్మన్ భాష నేర్పించి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విదేశాలలో ఉపాధి కొరకు ప్రైవేటు ఏజెన్సీల మాటలు నమ్మి మోసపోవద్దని, విదేశాల్లో భారతీయ యువతకు విస్తృతమైన అవకాశాలున్నాయని, టాంకాం ద్వారా అర్హులైన నిరుద్యోగ యువతకు విదేశాలలో ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఇప్పటికే లక్షకు పైగా ఉద్యోగాలు కల్పించిందని, టామ్ కామ్ కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇదే తరహాలో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య ఐ.టి.ఐ. ప్రిన్సిపల్ దేవానంద్ లతో కలిసి మందమర్రిలోని ఎ.టి.సి. సెంటర్ను సందర్శించారు. ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థలను మరింత అభివృద్ధి చేస్తూ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి వివిధ వృత్తి విద్య కోర్సులలో శిక్షణ అందించి స్వయం ఉపాధి దిశగా నిరుద్యోగ యువతను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాలలో కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 20లోపు పట్టాదార్ పాస్‌బుక్‌తో మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్







నిర్మల్ జిల్లా ఏప్రిల్ 15 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లాలో రాబోయే ఖరీఫ్ సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతుల సంక్షేమం కోసం మొబైల్ నంబర్ల నవీకరణ ప్రక్రియను రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపట్టిందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ప్రస్తుతం గ్రామాల వారీగా రైతుల పట్టాదార్ పాస్‌బుక్‌లను వారి ప్రస్తుత మొబైల్ నంబర్లతో అనుసంధానించే కార్యక్రమం కొనసాగుతున్నదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎరువుల బుకింగ్ కోసం యాప్ వినియోగం, ప్రభుత్వ రాయితీలు, ఇతర వ్యవసాయ సేవలు పొందేందుకు ఈ మొబైల్ నంబర్ అనుసంధానం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతులందరూ తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారులను (AEO) సంప్రదించి తమ పట్టాదార్ పాస్‌బుక్ వివరాలు, మొబైల్ నంబర్‌ను ధృవీకరించుకోవాలని కలెక్టర్ సూచించారు. మొబైల్ నంబర్ నమోదు సమయంలో వచ్చే ఓటీపీ ద్వారా ధృవీకరణ పూర్తి చేయబడుతుందని తెలిపారు. గతంలో తప్పుగా నమోదైన మొబైల్ నంబర్లను సవరించుకునేందుకు ఇదొక మంచి అవకాశం అని పేర్కొన్నారు. అలాగే రైతు రిజిస్ట్రీలో పేరు లేని వారు వెంటనే తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మొబైల్ నంబర్ల అప్‌డేటింగ్ ప్రక్రియకు ఏప్రిల్ 20, 2026 తుది గడువు కాగా, అందరూ నిర్ణీత సమయంలోగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# స్టేట్ రెండవ ర్యాంకు సాధించిన ఎర్దండి ముద్దుబిడ్డ పావని..ర్యాంకులకు పేదరికం అడ్డుకాదు..



ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ: ఏప్రిల్ 15 జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన ఉప్పరి నాగరాజ్ సత్యవతి,ల కూతురు పావని ఇంటర్ మొదటి సంవత్సరంలో470 మార్కులకు 467 మార్కులతో స్టేట్ రెండవ ర్యాంకు సాధించి, ర్యాంకులకు పేదరికం అడ్డు కాదని నిరూపించింది. ర్యాంకులు సాధించాలంటే కార్పొరేట్ సంస్థలలో లక్షలు,లక్షలు గుమ్మరించడం అవసరంలేదు. సరైనప్రణాళికతో చదివితే ప్రభుత్వకళాశాలలే మేలని నిరూపించిన పావని.. స్టేట్ రెండవ ర్యాంక్ పొంది రాబోవు తరానికి ఆదర్శంగా అయ్యుంది..గ్రామానికి ఇంతటి పేరుతెచ్చిన పావని అలాగే పావనికి సహకరించిన తల్లితండ్రులకు,గురువులకు కృతజ్ఞతలు తెలుపుతూ చిరు సత్కారం చేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో శేఖర్ రుద్ర, రమణ, రవి, రాజు, అరుణ్,గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# తీగల విక్రమ్ కుటుంబాన్ని పరామర్శించిన జువ్వాడి కృష్ణ రావు



ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ ఏప్రిల్ 15 ఇబ్రహీంపట్నం మండలనికి చెందిన తీగల విక్రమ్ తల్లి మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణ రావు. ఈ కార్యక్రమం లోకాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎలాల వెంకట్ రెడ్డి, BC సెల్ అధ్యక్షుడు బుస రాజేష్,ఎలిసే రాజు, గుడ ఐలాపూర్ భూమారెడ్డి, గూడ రాజారెడ్డి,పిట్టల వంశీ,కళ్లెం సత్య రెడ్డి,రెబ్బటి శేఖర్, తిమ్మని రాములు,వల్గొట్ నరేష్ బజ్జి సంజీవ్, కనుక జగన్,తదితరులు పాల్గొన్నారు

# ఖుతుబోద్దీన్ పాషా, అజీమ్ కుటుంబాలకు టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు పరామర్శ



మెట్ పల్లి అమృత్ తెలంగాణ ఏప్రిల్ 15: కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దీన్ పాషా, మెట్పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అజీమ్ ల తల్లి మృతి పట్ల టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు సంతాపం వ్యక్తం చేశారు.గత ఐదు రోజులు క్రితం వారి తల్లి మరణించగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్న వారు, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని.ఈ కష్ట సమయంలో ఆ కుటుంబానికి మనోధైర్యం కలగాలని సుజిత్ రావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్,కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మారుతి, మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్ముల చిన్నారెడ్డి,వెంకట గిరి,కల్లెడ గంగాధర్,సావుదాల సంజీవ్,బైండ్ల శ్రీకాంత్,సమీర్ సర్కార్ తదితరులు ఉన్నారు.

# ఆదర్శ గ్రామ యోజన ద్వారా గ్రామాలలో సమగ్ర అభివృద్ధి, వసతుల కల్పనకు చర్యలు : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ ఏప్రిల్ 15, 2026: ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం ద్వారా గ్రామాలలో సమగ్ర అభివృద్ధి, వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులు, సంబంధిత అధికారులతో కలిసి ఎంపిక చేయబడిన 7 గ్రామాల సర్పంచ్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన (పి.ఎం.-అజయ్) క్రింద అమలు చేయబడుతున్న ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన (పి.ఎం.ఎ.జి.వై.) ద్వారా గ్రామీణ ప్రాంతాలలో సమగ్ర అభివృద్ధి సాధించడం లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఎంపిక చేసిన గ్రామాలను "ఆదర్శ గ్రామాలు"గా అభివృద్ధి చేయడం ప్రధాన ఉద్దేశ్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలోని చెన్నూర్ మండలంలోని సుందరశాల, దండేపల్లి మండలంలోని ధర్మారావుపేట, హాజీపూర్ మండలంలోని హాజీపూర్, జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రొమ్మిపూర్, కన్నెపల్లి మండలంలోని సాలిగాం, తాండూర్ మండలంలోని చౌటుపల్లి, వేమనపల్లి మండలంలోని బయ్యారం గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఆదర్శ గ్రామంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు, సేవలు అందుబాటులో ఉండి, జీవన ప్రమాణాలు మెరుగుపడేలా, ప్రతి వ్యక్తి తన సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకునే వాతావరణం కలిగిన గ్రామంగా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. అనుసూచిత జాతుల పేదరికాన్ని తగ్గించడం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను పెంపొందించడం, ఆదాయ వృద్ధికి దోహదపడే కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఎస్.సి. ప్రాధాన్య గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం, సామాజిక-ఆర్థిక సూచికలను అభివృద్ధి చేయడం, విద్యలో ప్రవేశాలను పెంచడం, విద్యార్థులకు వసతి సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా 100 శాతం నిధులతో పథకం అమలు చేయడం జరుగుతుందని, అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వాలు అదనపు నిధులను కేటాయించవచ్చని తెలిపారు. మొత్తం నిధులలో కొంత శాతం పరిపాలనా వ్యయాలు, శిక్షణ, సామాజిక ఆడిట్, అవగాహన కార్యక్రమాలు, మూల్యాంకనం వంటి కార్యకలాపాలకు వినియోగించబడుతుందని తెలిపారు. ఆదర్శ గ్రామ అభివృద్ధి కోసం రూపొందించే కార్యాచరణ ప్రణాళికలో గ్రామ స్థాయి కమిటీ ఏర్పాటు నుండి గ్రామ అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయడం వరకు జాగ్రత్తగా వ్యవహరించాలని, ఈ ప్రణాళికలో గ్రామ సభ ఆమోదంతో అభివృద్ధి పనులు చేపట్టడం, లోటుపాట్లను గుర్తించి వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం, నిధుల వినియోగం, పూర్తి చేయాల్సిన పనుల సంఖ్య, తదితర అంశాలపై పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల సమన్వయంతో ఈ పథకం కొనసాగుతుందని, పరిష్కరించలేని మౌలిక అవసరాలను 'గ్యాప్ ఫిల్లింగ్' నిధుల ద్వారా తీర్చడం జరుగుతుందని తెలిపారు. ఎంపిక చేయబడే గ్రామాలు సాధారణంగా 40 శాతం కంటే ఎక్కువ షెడ్యూల్డ్ కులముల జనాభా కలిగి ఉండాలని, కనీసం 500 జనాభా ఉండాలని తెలిపారు. గ్రామ స్థాయిలో అవసరాల అంచనా, గృహ సర్వేలు, మౌలిక సదుపాయాల లోటుపాట్ల గుర్తింపు, కుటుంబ స్థాయి అవసరాల విశ్లేషణ ప్రక్రియల ద్వారా ప్రణాళిక రూపొందించబడుతుందని, ప్రక్రియ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రణాళిక గ్రామ సభ ఆమోదం పొందిన తరువాత జిల్లా స్థాయి కమిటీకి పంపించి ఆమోదం పొందుతుందని తెలిపారు. పథకం అమలులో భాగంగా గ్రామ స్థాయి సమన్వయ కమిటీలు, జిల్లా స్థాయి ప్రాజెక్ట్ అప్రైజల్ కమిటీలు, రాష్ట్ర స్థాయి కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని, గ్రామ సర్పంచ్ అధ్యక్షతన గ్రామస్థాయి కమిటీ, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ పనిచేస్తూ పథకం అమలు, పర్యవేక్షణ, సమన్వయం వంటి బాధ్యతలను నిర్వహిస్తుందని తెలిపారు. ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన ద్వారా గ్రామాలలో సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, సామాజిక సమానత్వం, జీవన ప్రమాణాల పెరుగుదల సాధించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా శాఖల అధికారులు, ఎంపిక చేయబడిన 7 గ్రామాల సర్పంచ్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బేగంపేటలో అగ్నికి ఆహుతైన కారు

ఏప్రిల్ 15 అమృత్ తెలంగాణ : బేగంపేటలో ప్రయాణిస్తున్న కారులో మంటలు చెలరేగాయి. మంగళవారం రాత్రి వరంగల్ నుంచి మణికొండ వైపు వెళ్తున్న ఒక కారు బేగంపేటలోని లైఫ్ స్టైల్ భవనం సమీపానికి చేరుకోగానే, ఇంజిన్ నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. ఘటన చోటుచేసుకున్న సమయంలో కారులో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. వారు వెంటనే అప్రమత్తమై కారును పక్కను నిలిపివేసి కిందకు దిగారు. దీంతో వారికి ప్రాణాపాయం తప్పింది. ప్రధాన రహదారిపై కారు తగలబడటంతో ఆ ప్రాంతంలో భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపు చేశారు. కారు ముందుభాగం పూర్తిగా దగ్ధమైంది.

# ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



అధికారతో అడిషనల్ కలెక్టర్



సమావేశంలో అధికారులు

నిర్మల్ జిల్లా ఏప్రిల్ 15 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. ఓపెన్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం, తన ఛాంబర్ లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 20వ తేదీ నుంచి 27 వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్న 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు పూటలా పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 1035 మంది పదవ తరగతి, 821 ఇంటర్, మొత్తం కలిపి 1856 మంది విద్యార్థులు, 5 ఎస్ ఎస్ సి, 4 ఇంటర్, మొత్తం 9 పరీక్ష కేంద్రాలలో ఓపెన్ పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. అన్ని పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాసేలా తగిన ఫర్నిచర్, తాగునీరు, నిరంతరాయ విద్యుత్ సరఫరా, తదితర వసతులు ఉండాలన్నారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బందితో కూడిన అత్యవసర వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన అత్యవసర మందులు, ఓఆర్ఎస్ పొట్లాలు అందుబాటులో ఉంచాలన్నారు. దూర ప్రాంత విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా అవసరమైకు ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. ఈ సమావేశంలో డిఈఓ భోజన్న, డిఐఈఓ పరుశురాం, తపాలా శాఖ ఇన్స్ పెక్టర్, ఎసిజిఈ పరమేశ్వర్, ఆర్టీసీ, వైద్య శాఖల అధికారులు రమేష్, సౌమ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చిత్తడి నేలల గుర్తింపునకు చర్యలు వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఫారెస్ట్ ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ జిల్లా ఏప్రిల్ 15 అమృత్ తెలంగాణ లో చిత్తడి నేలల (వెట్ల్యాండ్స్) గుర్తింపు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో చిత్తడి నేలలను శాస్త్రీయంగా గుర్తించి, వాటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చిత్తడి నేలల అభివృద్ధి ద్వారా పర్యాటక అవకాశాలు పెరిగి, జిల్లాకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని తెలిపారు. దీంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు. చిత్తడి నేలలు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని, జీవ వైవిధ్య పరిరక్షణకు అవి ఎంతో అవసరమని కలెక్టర్ వివరించారు. నిబంధనలకు అనుగుణంగా చిత్తడి నేలలను గుర్తించి, అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ప్రతిభ : జిల్లా కలెక్టర్‌కు అధికారుల అభినందన



అధికారులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ జిల్లా ఏప్రిల్ 15 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలలో నిర్మల్ జిల్లా విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరచడంతో, పలువురు అధికారులు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలను అందజేశారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ప్రోత్సాహం అందించినందుకు కలెక్టర్‌కు అధికారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటర్ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమిష్టి కృషి ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ ఫలితాలు అందరి కృషి ఫలితమని, రానున్న రోజుల్లో మరింత కష్టపడి జిల్లాను విద్యారంగంలో ముందువరుసలో నిలపాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరుశురాం, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# వేడిగాలులపై అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ జిల్లా ఏప్రిల్ 15 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. సాధారణ స్థాయికి మించి 1.5°C నుండి 3.5°C వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని, జిల్లాలో వచ్చే వారం రోజుల పాటు వేడి గాలులు (హీట్‌వేవ్) ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. పట్టణాలు, గ్రామాలు, ట్రాఫిక్ కూడళ్ల వద్ద అవసరమైన ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. చలివేంద్రాల్లో ప్రజలకు తాగునీటితో పాటు ఓఆర్ఎస్ (ORS) ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రజలు తగినంత నీరు తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, అనారోగ్యంతో ఉన్న వారు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. జిల్లాలో హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్‌ను అత్యవసరంగా సిద్ధం చేసి అమలు చేయాలని, ప్రదేశాల వారీగా వాతావరణ పరిస్థితులను భారత వాతావరణ శాఖ (IMD) వెబ్‌సైట్ ద్వారా నిరంతరం పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు అప్రమత్తంగా ఉండాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, డీహైడ్రేషన్ చికిత్సకు అవసరమైన ఔషధాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ప్రజలు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# డాకారులకు బహుమతులు అందజేత

ఏప్రిల్ 15 అమృత్ తెలంగాణ : కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టిన కేంద్రంలో భాగంగా ఈనెల 9 నుంచి 15 వరకు అట్టహాసంగా నవపేట్ మండల పరిధిలోని యన్మన్గండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలోనిర్వహించిన క్రీడలలో భాగంగా పలు క్రీడలలో యువత పోటీల్లో పాల్గొని తమ క్రీడను ప్రదర్శిస్తూ క్రీడా క్రికెట్ స్ఫూర్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా విన్నర్ రన్నర్ లుగా విజేతలుగా క్రికెట్ విభాగంలో తీగలపల్లి గ్రామం నుండి , రనర్స్ గా కాకర్ల పహాడ్, వాలీబాల్ విభాగంలో మరికల్ విజేతగా రన్నర్స్ గా ఇప్పటూర్, కబడ్డీ విభాగంలో విజేతగా కాకర్ల పహాడ్ గ్రామం, రన్నర్స్ గా మరికల్, కోకో రన్నింగ్ విభాగాల నుంచి విజేతలు నిలిచారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు లక్ష్మి నారాయణ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లోని క్రీడాకారుల నుండి ప్రతి విభాగంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను మన నియోజకవర్గ సాయికి క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్మనగండ్ల సర్పంచ్ రంజిత్ గౌడ్, జిల్లా కౌన్సిల్ నెంబర్ శ్రీనివాసులు మండల ప్రధాన కార్యదర్శి గణేష్ చారీ మండల బిజెపి సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, బిజెపి నాయకులు వార్డ్ నెంబర్ సుధాకర్ ఇప్పటూరు, వ్యాయామ ఉపాధ్యాయులు వినోద్ కుమార్ బృందం పెద్ద మొత్తంలో క్రీడాభిమానులు ప్రజలు పాల్గొన్నారు.





# గ్యాంగ్ లీడర్ బ్యూటీ అందాల డోస్ పెంచుతోంది



నాని గ్యాంగ్ లీడర్ సినిమా తో పాటు శర్వానంద్ తో శ్రీకారం సినిమాలో నటించిన ముద్దుగుమ్మ ప్రియాంక అరుల్ మోహన్. రెండు సినిమాల్లో కూడా చాలా పద్దతైన పక్కింటి అమ్మాయి పాత్రలో కనిపించి మెప్పించిన ఈ అమ్మడు తమిళంలో వరుసగా ఆఫర్లు దక్కించుకుంటుంది. శివ కార్తికేయన్ తో డాక్టర్ మరియు డాన్ సినిమాల్లో నటించి సక్సెస్ లు దక్కించుకుంది. సినిమాల ఎంపిక విషయంలో ఈ అమ్మడు ఆచితూచి వ్యవహరిస్తుంది. హీరోయిన్ గా ఈ అమ్మడు చేస్తున్న సినిమాలు తక్కువే అయినా కూడా వచ్చిన గుర్తింపు మాత్రం ఎక్కువే. ఈమె స్కిన్ షో విషయంలో కూడా పెద్దగా ఆసక్తి చూపించిన దాఖలాలు ఇప్పటి వరకు లేదు. కాని తాజా పరిణామాలు చూస్తుంటే ఈ గ్యాంగ్ లీడర్ బ్యూటీ అందాల డోస్ పెంచుతున్నట్లు గా అనిపిస్తుంది. ఆమధ్య నడుము అందాన్ని ఎక్స్ పోజ్ చేస్తూ షేర్ చేసిన ఫోటోలు వైరల్ అయ్యాయి. హీరోయిన్ గా ఈ అమ్మడు గ్లామర్ పాత్రలు చేసేందుకు సిద్ధం అన్నట్టుగా ఆ ఫోటోలతో చెప్పకనే చెప్పింది. హీరోయిన్ గా ఇక ముందు చేయబోతున్న సినిమాల్లో ఒక మోస్తరు వరుకు అందాల ఆరబోత కు ఎలాంటి ఇబ్బంది లేదు అన్నట్లుగా మరోసారి ఈ అమ్మడు తాజా ఫోటో షూట్ తో తేల్చి చెప్పింది. ప్రియాంక తాజాగా షేర్ చేసిన ఫోటోల్లో షర్ట్ బటన్స్ పూర్తిగా తీసేసి నడుము అందాన్ని చూపిస్తూ మతులు పోగొడుతోంది. సాదారణంగా ముద్దుగుమ్మలు స్కిన్ షో చేయకుండా అప్పుడప్పుడు ఇలా నడుము కనిపించి కనిపించకుండా ఎక్స్ పోజ్ చేసినా కూడా హాట్ టాపిక్ అవుతుంది. ఇప్పుడ ప్రియాంక మోహన్ విషయంలో అదే జరుగుతుంది. ఈమె చిన్న ఎక్స్ పోజింగ్ కే అందాల డోస్ పెంచుతున్న ప్రియాంక అన్నట్లుగా కామెంట్స్ వస్తున్నాయి. కొందరు మాత్రం ప్రియాంక హాట్ గా కంటే కూడా క్యూట్ గానే ఎక్కువ అందంగా ఉంటుంది. అందుకే ముందు ముందు ఈ అమ్మడు హాట్ అందాలను షేర్ చేయవద్దంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. మరి ఈ అమ్మడి ముందు ముందు అడుగులు ఎలా ఉంటాయో చూడాలి.

# కృతికి ఆరంభమే పాన్ ఇండియా ఆఫర్



కెరీర్ ప్రారంభించిన తక్కువ సమయంలోనే అసాధారణ స్టార్ డమ్ ని అందుకున్న తారలు కొందరున్నారు. ఇటీవలి కాలంలో కన్నడ బ్యూటీ రష్మిక మందన ఈ కేటగిరీకి చెందుతుంది. ఆ తర్వాత మరో పేరు తెలుగు సినీసర్కిల్స్ లో ప్రముఖంగా వినిపిస్తోంది. ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి మోస్ట్ లక్కీయెస్ట్ గాళ్! అంటూ ప్రశంసలు అందుకుంటోంది. ఈ బ్యూటీ ఉప్పెన తర్వాత వరుసగా పలు క్రేజీ చిత్రాలకు సంతకాలు చేసింది. ఇందులో వారియర్ లాంటి పాన్ ఇండియా సినిమా తనకే దక్కడం లక్కీ అని చెప్పాలి. ఇటీవల విడుదలైన ట్రైలర్ లో కృతి లుక్ ఎంతో క్యూట్ గా ఆకట్టుకుంది. నిజానికి కొందరికి టైమ్ అలా కలిసొచ్చేస్తుంది. కెరీర్ ఆరంభమే లింగుస్వామి లాంటి ప్రతిభావంతుడి నిర్దేశనంలో కృతి పాన్ ఇండియా నాయికగా పరిచయమైపోతోంది. ఎనర్జిటిక్ యాక్టర్ రామ్ పోతినేని సరసన కృతి శెట్టి కనిపించనుంది. లింగుసామి దర్శకత్వం వహించిన ఈ చిత్రం గురువారం విడుదల కానుంది. సెన్సార్ సహా అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. యుఏ సర్టిఫికేట్ ను పొందినట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమా 155 నిమిషాల నిడివితో ఉంటుందని.. ఇది మంచి రన్ టైమ్ అని కూడా చిత్రబృందం ధృవీకరించారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ నిర్మించిన ఈ ద్విభాషా చిత్రంలో ఆది పినిశెట్టి- అక్షర గౌడ- నదియా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సౌండ్ ట్రాక్ లు అందించారు.

# ఆ మూడు రోజులు మధురమైనవి అంటున్న మిల్కీ బ్యూటీ!



పాల నురగ చాయతో మెరిసిపోయే మిల్కీ బ్యూటీ తమన్నా సినిమా రంగంలోకి ప్రవేశించి దాదాపు 15 ఏళ్లు దాటిపోయింది. మంచు మోహన్ బాబు కుమారుడు మంచు మనోజ్ హీరోగా శ్రీ చిత్రంలో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ అందాల భామ ఆ తర్వాత టాలీవుడ్ లో స్టార్ హీరోలందరితో నటించింది. ఇక మెగా హీరోలందరితో నటించిన రికార్డు తమన్నా పేరు మీదే ఉంది. మెగాస్టార్ చిరంజీవి (సైరా) పవన్ కల్యాణ్ (కెమెరామెన్ గంగతో రాంబాబు) వరుణ్ తేజ్ (ఎఫ్ 3) రామ్ చరణ్ (రచ్చ) అల్లు అర్జున్ (బద్రీనాథ్) ఇలా మెగా హీరోలతో ఆడిపాడింది.. ఈ భామ. వీరు మాత్రమే కాకుండా టాలీవుడ్ స్టార్ హీరోలందరితోనూ తమన్నా నటించింది. కాగా తమన్నా ఓవైపు సినిమాలు వెబ్ సిరీసుల్లో మరోవైపు ఐటెమ్ సాంగులకు కూడా ఓకే అంటోంది. దాదాపు ఆమె కెరీర్ ఎండింగ్ కు చేరుకుంది. ఈ నేపథ్యంలో దీపముండగానే ఇళ్లు చక్కబెట్టుకోవాలనే రీతిలో వచ్చిన ప్రతి ఆఫర్ కు సై అంటోంది. అలాగే మరోవైపు ఈ భామకు ఆధ్యాత్మిక చింతన కూడా ఎక్కువే. ఇటీవల కాలంలో గుళ్లూ గోపురాలు శక్తి పీఠాలు అంటూ సందర్శనలు చేస్తోంది. తన తోటి హీరోయిన్లు.. సమంత నయనతారలు ఈ దేవాలయాల సందర్శనలో మిల్కీ బ్యూటీకి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంతవరకు పెళ్లి ఊసెత్తని తమన్నాషూటింగ్ విరామ సమయంలో ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుంటోంది. అంతేకాదు ఇటీవల హిమాలయ ప్రాంతాలను కూడా చుట్టివచ్చింది.

# సౌందర్యలో ఎన్నటికీ తరగని నిధులు అవే



రాంచీ డైరీస్- రక్తాంచల్ వెబ్ సిరీస్ లతో పాపులరైన బ్యూటీ సౌందర్య శర్మ. దిల్లీ టు గల్లీ ఈ భామకు భారీ ఫాలోయింగ్ పెరిగింది అంటే ఆ రెండు సిరీస్ లు కారణం. నటిగా మరో లెవల్ చూపించిన ఈ బ్యూటీ నిజానికి యాక్టర్ కాబోయి డాక్టర్ అయిన తన మామ్ ఇచ్చిన స్ఫూర్తితో సినీరంగంలో అడుగుపెట్టింది. ఇక ఇటీవలి కాలంలో బాలీవుడ్ లో బిగ్ రేంజ్ చూపించేందుకు తనవంతు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. పంతం పట్టుదలతో ఎంత దూరం అయినా వెళ్లేందుకు సౌందర్య శర్మ వెనకాడదు. పోటీ ప్రపంచంలో తనని తాను ఆవిష్కరించుకునేందుకు వైవిధ్యమైన ప్లాన్ తో దూసుకెళుతోంది. అనుపమ్ ఖేర్ నిర్మించిన రాంచీ డైరీస్ తో తెరకు పరిచయమైన సౌందర్య శర్మ నటిగా తన పాత్రను పోషించిన విధానం అందరినీ ఆకట్టుకుంది. ఆ తర్వాత రక్తాంచల్ రెండు భాగాల్లో నటించింది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com